



# అవగాహన

కె.కె.రఘునందన

ఫెళ్లున ఎండ కాస్తోంది.

కర్ఫ్యూ సమయంలో బయటకు తొంగి చూడ్డానికి కూడా భయపడ్డట్లుగా- గడపలోంచి వీధిలోకి కాలు పెట్టడానికి వెరుస్తున్నారు జనం.

డబ్బున్నవాళ్ళకి మాత్రం ఎండా కాలం కులాసాగానే వుంటుంది. హాయిగా ఎయిర్ కండిషన్ గదిలో కూర్చుని వీడియో చూస్తూ ఎంచక్కా కాలాన్ని నెట్టేయొచ్చు.

నేను డబ్బున్నవాడినే కాబట్టి-విజయ నగరం రాజావారిలా దిలాసాగా, దుబ్బు మీసాలు దువ్వుకుంటూ- లేవడానికి కూడా వీల్లేని బొజ్జని పెంచేసి కుర్చీలో కుదురుగ్గా కూర్చున్నా- ఎప్పటికప్పుడు నాకు ఫ్రూట్ జ్యూస్ అందిస్తూ సేవలు చేస్తున్నారు మా అబ్బాయిలు- అమ్మాయిలు.

కొత్తగా మంత్రి పదవి చేపట్టిన ఎమ్మెల్యే క్కూడా యింత కుషామత్ కుదరదేమో!

"డాడీ! కొత్త వీడియో కేసెట్ తెప్పించవా!!" అంటూ గదిలోకి అడుగు పెట్టాడు మా చిన్నబ్బాయి శ్రీచంద్ర.

కుటుంబ నియంత్రణ పాటించకుండా జనాభా పెరుగుదలకి కారణం అయిన నా సుపుత్రుల పుత్రికలలో శ్రీచంద్ర ఒక్కడికే అలా వితారుగా నా దగ్గర నిలబడి మాట్లాడే ధీమా, నిర్భీకత ఉన్నాయి. దానిక్కారణం వాడిపట్ల నేను చూపే

అతిథపువు కావచ్చు.

వారి కోరిక మేరకు వెంటనే ఫోన్ కొట్టాను.

నా గొంతు వినటంతోటే షాపువాడు తెగ వినయం ప్రదర్శిస్తూ వెంటనే కేసెట్స్ పంపడానికి ఏర్పాటు చేస్తున్నా నన్నాడు.

అన్న ప్రకారం ఓ పది నిముషాల్లో కేసెట్లు గడపలో వాలాయి.

ఆ ఊర్లో నాకున్న డబ్బుని బట్టే గౌరవం మర్యాద, పలుకుబడి-యివన్నీ చెప్పాపెట్టకుండా వచ్చేసిన బంధువుల్లా నాపైబడ్డాయి.

ఆ డబ్బు రావటానికి కూడా కారణం-సరస్వతీ ట్రాన్స్‌పోర్ట్ పేరుతో-ఆంధ్ర దేశమంతటా బ్రాంచీలు స్థాపించి సమర్థంగా పార్సెల్ సర్వీస్ చేస్తున్న ఘనకీర్తి నాకే దక్కింది- అందుకే దేశంలో చాలామంది మిలియనీర్లలో నేను ఒకణ్ణి కావటానికి ఎంతో కాలం పట్టలేదు.

ప్రస్తుతం ఎక్కడ ఏ ప్రారంభోత్సవ మన్నా నా చేతిమీదుగా జరగాల్సిందే. ఏ మీటింగయినా అధ్యక్ష పదవిని నేను అలంకరించాల్సిందే. అయితే నేను కూడా బిజినెస్ వ్యవహారాలతో ఎంత బిజీగా ఉన్నాసరే ప్రారంభోత్సవాలకి- మీటింగ్ లకి మాత్రం ఎగొట్టే ప్రశ్నేలేదు. తద్వారా పదుగుర్లో నాకు పెరిగే పేరు ప్రతిష్ఠలమీద మోజే అందుక్కారణం.

తీరిగ్గా కూర్చుని సంఘంలో నా పరపతి, హోదాలు గురించి ఆలోచించుకుంటుంటే అదో తృప్తి గర్వమూ.

ఆ రోజు తీరిగ్గా ఉండబట్టే హాయిగా గదిలో కూర్చుని మీసాలు దువ్వుకుంటూ ఆలోచిస్తున్నాను.

"డాడీ! ఎవరో అబ్బాయి వచ్చాడు. బయట గూర్ఖా అతణ్ణి లోనికి రానీకుండా అడ్డుపడ్డా నేనే అతణ్ణి లోనికి పంపాను. పాపం బీదవాడిలా వున్నాడు. మిమ్మల్ని కలవాలని తొందరపడుతున్నాడు." అంటూ వాసుగాడు చెప్పాడు.

బయట ఎండ విపరీతంగా వుంది. ఎండని చెరుగుతుంటే పనిగట్టుకుని నన్ను చూడ్డానికి ఎవరొచ్చారో నాకు అంతుబట్టలేదు.

ఎవర్నీ ఈ సమయంలో లోపలికి రానివ్వొద్దని నా ఆదేశం ప్రకారమే గూర్ఖా అతణ్ణి ఆపి వుంటాడు.

కాని మా పెద్దాడు వాసుగాడిది గాంధీ గారిలా జాలి హృదయం. "అయితే రమ్మను!" అన్నాను.

వాసు వెళ్ళిన రెండు నిముషాలకు ఆ కుర్రవాడొచ్చాడు.

తొలకరిజల్లు పడగానే పుట్టుకొస్తున్న పసకలా ఆ అబ్బాయికి నూనూగు మీసాలు వస్తున్నాయి.

సరైన తిండి, పోషణ లేనికారణంగా ఎంతో అందంగా పచ్చగా మిసమిస లాడుతూ మెరిసిపోవాల్సిన ముఖం పీక్కు పోయి వుంది. కళ్ళల్లో కాంతిలేదు సరి

కదా గుంటలుపడ్డాయి.

అవయవాలను కప్పటానికి బట్టలు వున్నా ఎముకలు మాత్రం వెళ్ళబెట్టి పట్లుగా కనిపిస్తున్నాయి.

ఎవరో ఏమిటో కనుక్కోకుండా ఎగాదిగా చూస్తుంటే నావంక విచిత్రంగా, భయంగా చూస్తుండిపోయాడు. "బాబూ మవ్వు!" అని అర్ధోక్తిగా అన్నాను.

"నేను మీ చిన్ననాటి మిత్రుడు శోభనరాజుగారి అబ్బాయిని. మీ యిద్దరూ చాలా సన్నిహితంగా ఉండేవారని నాన్న చెప్పారు" అని జ్ఞాపకం చేయటానికి ప్రయత్నించాడు.

ఏ మనిషైనా గతం తలుచుకున్నప్పుడు బాల్యానికి ప్రథమస్థానం ఇస్తాడు. అది మధురమైంది, బంగారంలా విలువైంది. స్మృతిపథంలో చెరిగిపోనిది.

తెలిసీతెలియని ఆ వయసులో ఏ చీకూచింతా, బరువుబాధ్యతలు లేకుండా స్నేహాలు, తిరుగుళ్ళతో ఆహ్లాదంగా చిదానందంగా గడిచిపోయిన ఆలనాటి రోజులు తలుచుకుంటే మనస్సులో తియ్యతీపు లూర్తాయి.

అటువంటి బాల్యం నా మనోనేత్రం ముందు నిలిచింది.

శోభనరాజు నా ప్రియమిత్రుల్లో ఒకరు.

నాకు బాగా జ్ఞాపకం.

పాపం! శోభనరాజు పిన్నవయసులోనే కష్టాల కడలి కెదురీది అలసిపోయాడు. వాడి తండ్రి తన వాళ్ళతో సఖ్యత లేని కారణంగా కష్టకాలంలో ఎవరి సాయమూలేక ఎన్నో ఇబ్బందులకు గురయ్యాడు. ఎంతయినా బ్రతికి చెడ్డవాడు. ఉకేమియా వ్యాధితో ఇల్లు గుల్లయి కొడుక్కి కష్టాలు పంచి తను దాటిపోయాడు.

శోభనరాజు అప్పుడు బి.ఏ. మొదటి సంవత్సరం. కొడుకు చదువు మధ్యలో కొండెక్కుతుందేమోనని అతని తల్లి తల్లడిల్లిపోయింది.

ఎలాగో అష్టకష్టాలు పడి ఆమె శోభనరాజుని గ్రాడ్యుయేట్ చేసింది. అయినా అతని కష్టాలు కడతేరలేదు. సరైన ఉద్యోగం దొరక్క ఆ కొల్లోయీ కొల్లో చాలీచాలని జీతానికి పని చేస్తూనే చెల్లెళ్ళ పెండ్లిండ్లు పూర్తయ్యాయని అనిపించాడు.


ఏనాడూ తడుముకోకుండా బొయ్యిమీద కుండ ఎక్కడం కుదర్లేదు ఆ కుటుంబానికి.

తరువాత్తరువాత ఓ పల్లెటూరు వెళ్ళిపోయాడు వాడు.

నేనేమో విజయనగరం వెళ్ళి స్థిరపడ్డాను. స్థితిమంతుణ్ణయ్యాను. ఇంతకాలానికి శోభనరాజు స్మృతులు గుండెల్లో కెర్లుకొచ్చాయి

"ఇంతకీ ఏమిటిలా వచ్చావు బాబూ!" అనడిగాను

అంతక్రితం బాగా దప్పిపోయి వచ్చా




దేమో...అది గమనించి ఫ్రిజ్ తెరిచి కూల్ డ్రింకు యిచ్చాను.

తాగాక-"నాన్నగారు మీకు ఈ లెటర్ యిమ్మన్నాడు" అని చొక్కా జేబులోంచి ఓ కాగితం తీసి నా కందించాడు.

చాలాకాలం తరువాత నాకు వాడినుండి వుత్తరం.

"ఒరేః భాగ్యరాజాః

ఆర్థికంగా, సంఘపరంగా ఎంతో ఎదిగిపోయిన నిన్ను ఓనాటి మిత్రుడిగా భావించి 'ఒరే' అంటున్నందుకు క్షమిస్తావనే ఆశిస్తాను. అయితే అవసరం కొద్దీ వుత్తరం వ్రాస్తున్నానని అనుకోకు. ఈ మధ్య నాకు మతిస్థిమితం లేకుండా పోయింది. అందుక్కారణం నా దుర్భర పరిస్థితులు. శత్రువుల్లా చుట్టు ముట్టిన భయంకర పరిస్థితులను ఎలా ఢీకొనాలో తెలీటంలేదు. ఓ బట్టలషాపులో రెండొందలకి పద్దులు రాస్తున్నాను. కాని నా సంసారం మొయ్యటానికి ఆ మైకం ఏపాటి ఊతమిస్తుందో వూహించు.

నా కొడుకు పృథ్వీ ఈ మధ్య డంకన్ ఎంటర్‌ప్రైజెస్‌కి అప్లికేషన్ పెడితే ఇంటర్వ్యూకి పిలుపొచ్చింది. అపాయింట్‌మెంట్ కమిటీకి అధికారివి నువ్వేనని తెలుసుకున్నాను. ఎలాగయినా ఉద్యోగం ఇప్పించు...నా సంసారానికి చేయూత నందించు."

ఎంతో ప్రాధేయపూర్వకంగా, దిగులుగా దిగజారిపోయి బతుకులో దప్పిపోయి రాసినట్లుగా అనిపించింది.

డంకన్ ఎంటర్‌ప్రైజెస్‌లో క్లర్క్ కమ్ టైపిస్టు పోస్టు ఫిలప్ చేయాలి. ఆ అధికారం నా గుప్పెట్లో వుంది.

కాని అది ఏనాడో మహాపాత్ర కూతురు రసమయికి మాట యిచ్చానే.

ఆరోజు...ఔను...ఆరోజు...

"ఎంతైనా భాగ్యరాజా అంకుల్‌కి నువ్వంటే ప్రీతమ్మా!" మహాపాత్రో తో షివాస్‌రీగల్‌లో అయిస్ క్యూబ్స్

వేసుకొని మెల్లగా గొంతులోకి దించుకుంటుంటే అన్నాడు:

కిలకిల నవ్వింది రసమయి.

స్వచ్ఛమైన తటాకంలో మిలమిల మెరిసే ఏవీల మీనాల్లాంటి కళ్ళు ..దానికి తోడు గొప్పింటి బిడ్డలకు ఐశ్వర్యంతో సహజంగా అబ్బిన ఒంటి బిగి.

"ఓ...యూ ఆల్ రైట్ డాడ్! అంకుల్ కి యీ సమాజంలో పదవి పలుకుబడి ఎంతున్నాయో నాపట్ల అంత ప్రేముంది" అంటూ పొగిడేసింది.

"అందుకే దంకన్ ఎంటర్ ప్రైజెస్‌లో టైపిస్టు పోస్టుకి నువ్వు ఎప్లయి చేయమ్మా....అంకుల్ చేతిలోనే వుంటది..." మహాపాత్రో రసమయి నిడువుపాటి శిరోజాల్ని ఆప్యాయంగా నిమురుతూ పలికాడు.

"వాటే జోక్...నీ కూతురు...లక్షలకి వారసురాలు. ఆఫ్టరాల్ ఓ ప్రైవేట్ కంపెనీలో గుమాస్తాగా చేరుస్తావా!" వెటకారంగా నవ్వాను.

"అంకుల్! డిగ్రీ అయి ఏడాదయింది ఒకటే బోర్‌గా వుంది... పెళ్ళి ఇప్పట్లో చేసుకోవాలని లేదు. అందుకే తప్పకుండా యిప్పించాలి అంకుల్...ప్లీజ్."

"మహాపాత్రో కూతురుగా నువ్వు అడగటం నేను కాదనటమూనా? ష్యూర్ నీకే ఆ పోస్టు..."

ఆరోజు మహాపాత్ర సమక్షంలో అతని కూతురు చేతిలో చేయివేసి మాట యిచ్చాను...అయితే యిప్పుడు శోభన రాజా ఈ కబురు పంపాడు.

ఏమని బదులిచ్చేది??

'అలాగే' అని పంపిస్తే...అనవసరపు భ్రమలు కల్పించి అంతిమంగా నిరాశపుచ్చినట్లవుతుంది.

ఎలా!

ఆ కుర్రవాడు నావంకే చూస్తున్నాడు


ఆ కుర్రాడికి ఎక్కడ మాటిస్తావో అన్నట్టు ఓవైపు రసమయి ఒక్కసారి మనోఫలకం మీద మెరుపులా మెరిసి 'అంకుల్'అంటూ అర్థింపుగా చూస్తోంది.

ఇంకోవైపు మహాపాత్ర మింగేసేలా చూస్తున్నాడు, కళ్ళల్లో కనిపించి...

అందుకే నన్ను నేను సంబాళించుకుని - "చూడు బాబూ! మీ నాన్న నాకు బాగా సన్నిహితుడన్నది నిజమే-ఉద్యోగంకోసం ఎంతో ఆశతో వచ్చావు... కాని ఆ దంకన్ ఎంటర్‌ప్రైజెస్ ప్రకటన కేవలం బోగస్.. సారీ! నాకు, దానికి సంబంధంలేదు...మీ నాన్నకి వేరేగా లెటర్ వ్రాయటం అనవసరం అనుకుంటున్నాను." అని నామట్టుకు నేను చేతులు దులిపేసుకున్నాను.

ఆ నిముషం - శోభన్‌రాజా, నేను, అనుభవించిన మైత్రీ మాధుర్యం కాని సహాయం అందించలేకపోతున్నందుకు దిగులు కాని, నా అంతరంగంలో కదలాడలేదు.

కేవలం నాకూ-మహాపాత్రోకు మధ్య



నడుస్తున్న డ్రింక్ ఫ్రెండ్‌షిప్- షివాస్ రీగల్- అందులో తేలుతున్న అయిసు క్యూబ్స్- అప్పుడప్పుడు మా యిద్దరి నడుమ బుట్టబొమ్మలా వచ్చి నిలుచుని చిలకపలుకులు పలికే రసమయి. అవే నా మనస్సులో తారాడాయి.

నా సమాధానం వినగానే ఆ కుర్రాడి మొహంలో దైన్యం పేరుకుపోయింది.

“వస్తా సార్! నమస్తే” లేచి వెళ్ళిపోయాడు.

నిర్లిప్తంగా వుండిపోయాను. పెద్ద అబ్బాయి వాసు తన స్నేహితుడు త్రిగుణతో పక్కగదిలో క్యారమ్స్ ఆడుతున్నాడు.

నెమ్మదిగా లేచి అటువేపు వెళ్ళాను.

“డాడీ! ఎండలోంచి ఓ పిచ్చుక... ఈ గదిలోకొచ్చి వాలుతోంది. దాన్ని పాపం రెండుసార్లు త్రిగుణ్ తరిమేసాడు. ఎండలోంచి వచ్చి యిక్కడ వాలిందంటే దానికి ఎక్కడా నీడలేకనే కదా! దాన్ని తరిమెయ్యటం అన్యాయమా కాదా? ఈ సారి పిచ్చుక వస్తే తరిమెయ్యద్దని త్రిగుణ్‌కి చెప్పు డాడీ!” అన్నాడు కళ్ళల్లో సానుభూతి నింపుకుని- వాసు. నేను చెప్పాగా వాడిదసలే జాలి గుండె అని.

“అదిగో మవ్వు అన్నంతలోనే వచ్చింది పిచ్చుక... త్రిగుణ్...!

తిప్పమ్మా! దాన్ని తరమకూడదు. పాపం!!" చెప్పాను.

ఆ క్షణం ఆ పిచ్చుకమీదకి నా దృష్టి మళ్ళింది. కాళ్ళతో ముక్కుని రాసుకుంటూంది... అదే చూస్తూ ఆలోచనలో పడ్డాను.

అవును... నేనే అన్నాను...పిచ్చుకకి పీడ నివ్వమని. తరిమెయ్యద్దనీ నేనే హెచ్చరించాను...

కాని... ఆ 'నేనే' రెండు నిముషాల క్రితం తనకి పీడ కావాలని వచ్చిన శోభన్‌రాజు కొడుకుని నిర్దాక్షిణ్యంగా తరిమేశాను.

ఈ సంఘటనవల్ల- నేనెంత పొరపాటు చేశానో కనువిప్పయింది. వాసుకున్న అవగాహన నాకు లేకపోయిందనిపించింది.

నన్ను నమ్మి వచ్చిన ఆ కుర్రాడికి పీడ కల్పించగలిగే అవకాశం నాకున్నా, హై సొసైటీ- నాగరికతల మత్తులోపడి క్షమించరాని నేరం చేశాను.

కాని ఆ తప్పును దిద్దుకునే మార్గం కూడా అవగాహన అయింది...

రసమయిక్ మాట యిచ్చిన 'మాట' నిజమే అయినా... పూట గడవని స్థితి కాదు వారిది...

ముఖ్యంగా ఉద్యోగం కావలసింది— దుఃఖం దారిద్ర్యంతో మగ్గుతున్న కుటుంబానికి తోడుగా నిలబడాల్సిన ఆ కుర్రవాడికి.

అందుకే తక్షణం గూర్ఖాకి ఫోన్‌లో చెప్పాను. ఇందాక నా దగ్గరకొచ్చిన కుర్రాణ్ణి— అర్జంటుగా తీసుకు రమ్మనమని.

